క్లుప్తంగా

దరఖాస్తులు త్వరగా పరిశీలించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

భీమిని: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలను శనివారం ఆయన సందర్శించారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను తహసీల్దార్లు బికార్ణదాస్, శ్రావణ్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి, అన్ని దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు బికార్ణదాస్, శ్రావణ్‌కుమార్, డీటీలు గోవర్ధన్, పోచయ్య, ఆర్‌ఐలు వెంకటేశ్, చంద్రమౌళి సిబ్బంది ఉన్నారు.

వసతులు కల్పించాలి

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మున్సిపాలిటీ 24వ వార్డు అంబేడ్కర్ రడగంబాల బస్తీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్డీవో పి.హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ టి.రమేశ్‌లకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. పాఠశాలకు ప్రహరీ, సరైన వంట గది లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు రామగిరి మహేశ్, నాయకులు రత్నం ఐలయ్య, రాజేశ్, చంద్రశేఖర్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మేనిఫెస్టో అంశాలు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన బీసీ అంశాలను అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, కార్యదర్శి భీంసేన్, నాయకులు గజ్జెల్లి వెంకటయ్య, రమేశ్, భిక్షపతి, రాజేశం, సతీశ్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

జన్నారం: జన్నారం మీదుగా భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఎత్తివేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్‌లు శనివారం దీక్షల్లో పాల్గొని మద్దతు తెలిపారు. రాకపోకల నిషేధం ఎత్తివేసే వరకు సామాజిక వేత్త భూమాచారి, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్‌లు చేపట్టిన దీక్షలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్, మాజీ సర్పంచులు గంగాధర్‌గౌడ్, నాయకులు సంతోష్‌నాయక్, గోపాల్‌రెడ్డి, పేరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచే అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ కౌన్సిల్ చీఫ్ అసిస్టెంట్ ఎం.డి సముధాని, అసిస్టెంట్ రాములు అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో శనివారం న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నచిన్న విషయాలకే ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. దీంతో పాటు ఆయా అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వసతి గృహం అధికారిని విజయలక్ష్మి, విద్యార్థినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వప్నం.. సాకారం!



గంగిపల్లిలో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు

చాలా సంతోషంగా ఉంది



ఇల్లు మంజూరు కావడం.. అది పూర్తి కావడం అంతా ఒక కలలా అనిపిస్తుంది. ఎన్నో ఏళ్లుగా రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నాం. ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేయడంతో స్లాబ్ ఇల్లు నిర్మించుకున్నాం. కొద్ది రోజుల్లోనే ఇల్లు ప్రారంభించుకోవడానికి అంతా తయారు చేసుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది.

– జలంపల్లి స్నేహ, గంగిపల్లి

- ఇందిరమ్మ పైలెట్ ప్రాజెక్టుగా గంగిపల్లి
- 117 ఇళ్లు మంజూరు.. పురోగతిలో 83
- సొంతింటి కల నెరవేరుతుండడంపై లబ్ధిదారుల్లో ఆనందం

జైపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి జిల్లాలో మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. నిరుపేద ప్రజలను గుర్తించి తొమ్మిది పిల్లర్లతో 600చదరపు అడుగుల విస్తీర్ణంలో స్లాబ్ ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుపేదల సొంతింటి కల సాకారం కానుంది. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం గంగిపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లు చకచకా చేపడుతున్నారు. జిల్లాలోనే గంగిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తికావస్తుండడంతో ఇళ్ల ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని ఇళ్లు తుదిమెరుగు దిద్దుకుంటుండగా, మరికొన్ని ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. ఆగస్టు 15వరకు ఇళ్లు ప్రారంభించనున్నారు.

- జైపూర్ మండలం గంగిపల్లి గ్రామాన్ని ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన అధికార యంత్రాంగం 117ఇళ్లు మంజూరు చేసింది. నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీలకు ఎంపిక చేసి పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం తొమ్మిది పిల్లర్లతో 400నుంచి 600చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు నాలుగు దశల్లో మంజూరు చేస్తోంది. 117ఇళ్లు మంజూరు కాగా ప్రస్తుతం 83ఇళ్లు వర్క్‌ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. 15నుంచి 20కి పైగా ఇళ్లు స్లాబ్ పూర్తిగా తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. అనుకున్న సమయానికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, ఆ ఇళ్లను ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



సబ్బని లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న అధికారులు

జైపూర్: మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటులో డీజీఎంగా విధులు నిర్వర్తించిన సబ్బని లక్ష్మణ్ ఇటీవల బదిలీల్లో డైరెక్టర్(పీపీ) కార్యాలయానికి వెళ్తుండగా అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శనివారం అడ్మిన్ భవన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, అధికారులు, ఉద్యోగులు లక్ష్మణ్‌ను శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఏళ్లుగా ఎస్టీపీపీలో ఆయన అందించిన సేవలపై అధికారులు, ఉద్యోగులు ప్రశంసించారు. కార్యక్రమంలో సీఎంవోఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏజీఎంలు మురళీధర్, అజాజుల్లాఖాన్, డీజీఎంలు పంతులా, సీనియర్ పీవో ఠాకూర్‌మోహన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సరైన ప్రణాళికలతోనే లక్ష్యాల సాధన

- జీఎం శ్రీనివాస్



అధికారులతో సమీక్షలో జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: సరైన ప్రణాళికలతోనే ఉత్పత్తి లక్ష్యం సాధించవచ్చని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గింపు కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్పత్తి అయిన బొగ్గును సకాలంలో రవాణా చేయాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి సహకరించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా పగడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. యంత్రాల పని గంటలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొంటే, అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవికుమార్, ఓసీపీ పీఓ ఏవీ రెడ్డి, డీజీఎంలు అనిల్‌కుమార్, ఆనంద్‌కుమార్, రాజన్న, మేనేజర్లు పాల్గొన్నారు.

వార్షిక లక్ష్యం సాధించాలి

శ్రీరాంపూర్: ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఆర్కే 5గనిపై శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. జూలై నెలలో 100శాతం ఉత్పత్తి సాధించినందుకు ఉద్యోగులను, అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు పనిచేయాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి కంపెనీకి శ్రేయస్కరం అన్నారు. జూలైలో అధిక ఉత్పత్తికి కృషి చేసిన ఏ రిలే ఉద్యోగులను అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏజెంట్ శ్రీధర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, ఇంజనీర్ శ్రీనివాస భట్టాచార్య, రక్షణ అధికారి శివయ్య, సంక్షేమ అధికారి హరికృష్ణ, ఫిట్ ఇంజనీర్ శ్యామ్, అసిస్టెంట్ మేనేజర్ రాందాస్, వినయ్ రెడ్డి, ఫిట్ సెక్రెటరీ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

మంచిర్యాలటౌన్: పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలను మాత్రమే తాగించాలని, అప్పుడే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుదల ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత అన్నారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో శనివారం తల్లిపాల విశిష్టతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచే తల్లిపాలను ఇవ్వడం ప్రారంభించాలని, దీని వల్ల బిడ్డతో పాటు, తల్లికి శ్రేయస్కరమన్నారు. జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల 2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతను సూపర్‌వైజర్ జ్యోతి తల్లులకు వివరించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భూదేవి, ఆయా ధనలక్ష్మీ పాల్గొన్నారు. అర్కలవాడ, అశోక్ రోడ్డు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.చందన తల్లిపాల విశిష్టతను వివరించి, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, భాగ్య, ఏఎన్ఎం సరిత, సహాయకురాలు గౌరీ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల, మోదెల గ్రామంలో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల విలువను తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చెన్నూర్: తల్లి పాలు బిడ్డకు మేలు చేస్తాయని, ప్రతి తల్లి పిల్లలకు తల్లిపాలనే ఇవ్వాలని సీడీపీవో మనోరమ అన్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలో బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు సత్యనారాయణ, సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థి ఎల్లవ్వతో సిబ్బంది

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని మార్నెరి ఎల్లవ్వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బండ జీవరత్నం తెలిపారు. గతనెల 31న పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో జావెలిన్ త్రోలో పాల్గొని, ద్వితీయ స్థానంలో గెలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. హన్మకొండలో ఈ నెల 4న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.



రంగులు పూర్తయిన దండేపల్లి కేజీబీవీ



లక్సెట్టిపేట బాలికల ఉన్నత పాఠశాల...



దండేపల్లి: ద్వారక ప్రాథమిక పాఠశాల

బడులకు కొత్తందాలు!

దండేపల్లి: జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, మోడల్‌స్కూల్స్, కేజీబీవీ విద్యాలయాల్లో మనఊరు–మనబడి, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో పనులు పూర్తైన బడులన్నింటికీ కొత్తగా రంగులు వేస్తున్నారు. దీంతో ఇన్నాళ్లు రంగులు లేక మాసిపోయిన బడులకు రంగులు వేస్తూ అందంగా తీర్చిదిద్దడంతో, బడులకు కొత్తందాలు సంతరించుకున్నాయి. రంగులు వేసిన బడులు, కార్పొరేట్ పాఠశాలలుగా మెరుస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో మనఊరు–మనబడి, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా సుమారు 750పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయగా, అందులో ఇప్పటి వరకు సుమారుగా 248పాఠశాలలకు రంగులు వేయడం పూర్తయినట్లు, ఇంకా కొన్ని పాఠశాలలకు రంగులు వేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి వివేక్ వెంకటస్వామి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి వివేక్

చెన్నూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యకు అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు.

మంత్రికి వినతులు..

దసలి పట్టు పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఎం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు సంకె రవి, ఎర్మ పున్నం, అంగన్‌వాడీ టీచర్లు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

బెల్లంపల్లిరూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు, గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలందించాలని బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ అన్నారు. బెల్లంపల్లి మండలంలోని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని వైద్య పరికరాలు, మందులు, పరిసరాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని సూచించారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు వ్యాధుల నివారణకు, సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామీణులకు వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కమ్యూనిటీ ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ వైద్యాధికారి తమ్మడి ఎవాంజలీన్, వైద్య సిబ్బంది జమున, రజిత, సాగర్, సుధాకర్, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపై ప్రమాద స్థలాల పరిశీలన

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

జైపూర్: హైదరాబాద్–ఇందారం క్రాస్ రోడ్డు రాజీవ్ రహదారిలో ప్రమాద స్థలాలను పోలీసులు, రాజీవ్ రహదారి నిర్వహణ చేపడుతున్న హెచ్‌కేఆర్ సంస్థ అధికారులతో శనివారం కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్, హెచ్‌కేఆర్ మేనేజర్ రామకృష్ణతో కలిసి ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాలను పరిశీలించి జాగ్రత్తలపై ఆదేశాలు ఇచ్చారు. ఇందారం బస్టాండ్, ఐకే–1 గని క్రాస్ రోడ్డు, గోదావరి బ్రిడ్జి, క్రాస్ రోడ్డులో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, కావున నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనదారులు నేరుగా రోడ్డుపైకి రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, సర్వీస్ రోడ్డుకు ఉన్న ఇనుప జాలీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న స్థలాల్లో సూచిక బోర్డులు, హెచ్చరికలు, స్టాపర్స్ ఏర్పాటు చేయాలన్నారు. వాహనదారులు అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడిపి విలువైన ప్రాణాలు పోగొట్టుకోవద్దని రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడిపించడం ద్వారా జాగ్రత్తగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

● ఎమ్మెల్యే పీఎస్సార్ కాలుకు ఆపరేషన్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కాలుకు గతంలో చేసిన ఆపరేషన్ వద్ద ఇన్‌ఫెక్షన్ కావడంతో, ఆయనకు ఇటీవల హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో మరోసారి ఆపరేషన్ చేసి ఇన్‌ఫెక్షన్‌ను వైద్యులు తొలగించినట్లు సమాచారం. నాలుగు రోజులుగా ఆసుపత్రిలోనే ఉండి విశ్రాంతి తీసుకుంటుండగా, ఈ నెల 4, 5 తేదీల్లో డిశ్చార్జి చేస్తారని తెలిసింది. గతంలో కాలుకు ఆపరేషన్ కాగా, గత నెలలో నియోజకవర్గంలో నిర్వహించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, బహిరంగ సభలో కాలు నొప్పితోనే పాల్గొన్నారు. తీరికలేకుండా పనులను పరిశీలించే క్రమంలోనే కాలుకు నొప్పి ఎక్కువై ఇన్‌ఫెక్షన్ సోకినట్లుగా తెలిసింది. ప్రస్తుతం ఎమ్మెల్యే విశ్రాంతి తీసుకుంటే, సరిపోతుందని వైద్యులు సూచించడంతోనే ఆసుపత్రిలో ఉన్నట్లుగా ఆయన వర్గీయులు చెబుతున్నారు.

● పీఎం కిసాన్ పథకంతో రైతులకు మేలు

చెన్నూర్‌రూరల్/బెల్లంపల్లిరూరల్: పీఎం కిసాన్ పథకంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఎం.ప్రసూన, జిల్లా వ్యవసాయాధికారి ఛత్రునాయక్ అన్నారు. బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో, చెన్నూర్ మండలం కిష్టంపేటలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన పీఎం కిసాన్ పథకం నిధుల విడుదల కార్యక్రమాన్ని లైవ్ వెబ్ కాస్టింగ్ స్క్రీన్‌లో అధికారులు రైతులతో కలిసి వీక్షించారు. ఆయా మండలాల అధికారులు, నాయకులు ఉన్నారు.

● కార్మికులకు రూ.10వేలు ఇవ్వాలి

చెన్నూర్: ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం నెలకు రూ.10వేలు ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6న రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

● 30 పడకల ఆసుపత్రిగా మార్చాలి

జన్నారం: జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆరు పడకల నుంచి 30 పడకల హాస్పిటల్‌గా మార్చాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అశోక్, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● కోటి పార్థివలింగార్చన మహోత్సవం

జన్నారం: జన్నారం పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా కన్వీనర్ ద్యావరశెట్టి రజిత, మహిళా బృందం సహకారంతో శనివారం కోటి పార్థివలింగార్చన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి, బాసర శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీ నిర్మల అంబికానాథ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు జక్కు భూమేశ్, కమిటీ సభ్యులు గోపాల కృష్ణ, మల్యాల కిరణ్, ద్యావరశెట్టి వాసు పాల్గొన్నారు.

● వాటర్‌ట్యాంక్ ఏర్పాటు

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బోర్‌వెల్ చెడిపోవడంతో విద్యార్థులకు నీటి సమస్య ఏర్పడింది. దీంతో విషయం తెలుసుకున్న డీఐఈవో అంజయ్య కళాశాలకు చేరుకొని నీటిసమస్య పరిష్కారానికి తాత్కాలికంగా సింగరేణి యాజమాన్యాన్ని సంప్రదించారు. కాసిపేట గని మేనేజర్ వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేసి విద్యార్థులకు నీటి సమస్య తీర్చారు.

● జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయాలి

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జాబ్ క్యాలెండర్ ప్రకారం తక్షణమే ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి శనివారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్, చెన్నూరు పట్టణ అధ్యక్షుడు ఎండి నాయక్, నాయకులు అజయ్, చంద్రకిరణ్, దేవి, సాయికృష్ణ, శివ, మని, తాండ్ర నరేశ్, వేల్పుల సాగర్, చిలుక అజయ్, సాయికిరణ్, సంతోశ్ పాల్గొన్నారు.

సమాచారం

● 6న ‘మా భూమి రథయాత్ర’

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 6న డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం రథయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు రమేశ్, సదానందం, జంగపెల్లి రామస్వామి, నందిపాటి రాజు, రేగుంట రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంబేడ్కర్ స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన వారందరూ ఓపెన్ డిగ్రీ చేసేందుకు అర్హులన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో చేరే విద్యార్థులు ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాలలో సంప్రదించాలన్నారు.

● సెప్టెంబర్ 1న మహాధర్నా

కోటపల్లి: సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే మహాధర్నాను పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్ పిలుపునిచ్చారు. కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణమూర్తి, అసోసియేట్ అధ్యక్షుడు బిల్లా తిరుపతయ్య, మండల కార్యదర్శులు బాపు, నాగేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నీటి సరఫరాలో అంతరాయం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నీటి సరఫరాలో వారం రోజుల పాటు అంతరాయం కలుగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి నీటి సరఫరాను సక్రమంగా చేపట్టడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పురప్రజలు సహకరించాలని కోరారు.

● బాధ్యతలు స్వీకరణ

కాసిపేట: మండల కేంద్రంలోని ఇందిర క్రాంతి పథం కార్యాలయంలో శనివారం ఏపీఎంగా రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.